# అలల అలజడి

-తమిరిశ జానకి

**జ**యదేవుడి అష్టపదిలోని శృంగారమంతా ఆమె కన్నుల్లో కదలాడుతోంది. అన్నమయ్య పదంలోని అంద మంతా ఆమె ముఖంలో తాండవిస్తోంది. కూచిపూడి భామాకలాపం ఆమె ఒంటి విరుపుల్లో చిందులేస్తోంది. ఆమె ఒక పాటలా, ఆమె ఒక నాట్యంలా గోచరిస్తోంది నాకు. ఎవరీమె? వారం రోజులుగా రోజూ గోదావ రొడ్డుకి వొచ్చి చీకటిపడే దాకా కూచునివెళ్తున్నాను. రెండు రోజులుగా ఆ అమ్మాయి కూడా రావడం... అల్లంతదూరంలో కూచుని నా వంకే చూడడం గమనిం చాను. గోదావర్లో తెల్లని నురుగుల అలలు... ఒడ్డున పరువాల అందాలు. కానీ... ఇలా ఒక్కత్తే వస్తోందే మిటి? కూడా ఎవరూ స్నేహితురాళ్ళు లేరే! నాకు మల్లేనే ఆమె కూడా ఈ ఊరికి కొత్తేమో? అసలెవరి తాలూకో?.... ఒక్క క్షణం నా మనసు తడబడింది. ఆమె ఎవరైతే నాకెందుకు? ఔను నాకెందుకు. మసక చీకట్లు కమ్ముకుంటున్నాయి. ఇదేవిటి? నా వైపేవొస్తోందమ్మాయి!

"నమస్కారమండీ"

పంచమస్వరంలో కోకిల గానం. ఎదురుగా కోకిల కాదు... కోమలాంగి... కాదు కాదు.

అష్టపది..అన్నమయ్య పదం.. కూచిపూడి భామ...

అప్రయత్నంగా ప్రతి నమస్కారం చేశాను.

ఎదురుగా కూచుంది. "మీరు రచయిత గారట కదా?"

తెల్లబోయాను. ఎవరీ అమ్మాయి? నా గురించి వాకబు చెయ్యడానికి నన్నెరుగున్న వాళ్ళెవ్వరూ ఈ ఊళ్ళో లేరే?

హైదరాబాద్‌లో సాఫ్ట్‌వేర్ కంపెనీలో ఉద్యోగం చేస్తున్న నాకు.. నా జీవితం మాత్రం సాఫ్ట్‌గా లేదా అన్న అనవసరమైన దిగులు ముంచేస్తూ ఉంటుంది ఒక్కోసారి. రాత్రంతా ఉద్యోగం... పగలింట్లో నిద్ర...

పెళ్ళి చేసుకుంటే కుటుంబానికి న్యాయం చెయ్య గలనో లేదోనన్న అనుమానం.

దడిపిస్తోంది నన్ను. ఒక్కొక్కసారి డిప్రెషన్లోకి వెళ్ళి పోతున్నాను.

"ఒక పని చెయ్యి..." హఠాత్తుగా అయినా ఆత్మీ యంగా ఒక సలహా ఇచ్చాడు. స్నేహితుడు రామ్మూర్తి. పెళ్ళయిన వాడు... భార్యా... పుత్రికారత్నంతో ఉద్యోగ రీత్యా హైదరాబాద్‌లో ఉన్నవాడు. అతనికి వాళ్ళ ఊళ్ళో సొంత ఇల్లుంది. ఒకసారెప్పుడో చాలా రోజుల కిందట నన్ను తీసికెళ్ళాడు కూడా తనతో.

"మా ఇల్లు తాళం వేసుంచాను అద్దెకివ్వలేదు. ఆ ఊళ్ళో అద్దెలెక్కువరావులే... పైగా ఎప్పుడైనా వెళ్ళి నాల్రోజులుండాలనిపిస్తే అద్దెకిచ్చేస్తే కుదరదు కదా. అందుకని అక్కడి మంచాలు కుర్చీలు ఇంకా కొన్ని సామాన్లు అక్కడే ఉంచేశాను. మా పిచ్చికగూడు ఎపార్టు మెంట్లో అంతజాగాలేదు. అమ్మబోతే అడివి కొనబోతే కొరివి కదా? అందుకే అవి అక్కడ ఉంచాను. నువ్వీ ఉద్యోగంలో జేరకముందు అడపా తడపా కథలు రాసేవాడివి కదా? ఇప్పుడు కూడా నీలో రచనలు చెయ్యాలన్నా తపన ఉందన్నావు కదా?

"నీ సొంత ఇంటికీ నా తపనకీ సంబంధం ఏమిటో నాకర్థం కావట్లేదు".

"చెప్తా చెప్తా...."

నాలో కుతూహలం పెరిగింది.

"నువ్వు కనీసం ఓ పదిహేను రోజులన్నా సెలవు పెట్టు"

ఇదింకా బావుంది. తన సొంత ఇంటికీ నా తపనకీ సంబంధం ఏమిటో అర్థం కాక నేనుంటే మళ్ళీ ఇదే మిటి?

"నీ కర్థం కాలేదు కదూ?"

"మహాప్రభో... జుట్టు పీక్కోవాలన్నంతగా అని పించినా చేతులు కూడా కదపలేనంత బిగుసుకు పోయాను... అర్థమై ఉంటే కనీసం నీ జుట్టున్నా పీకే వాడిని. నీ సొంతిల్లేమిటి? నా తపనేమిటి? కంపెనీ వాళ్ళు పదిహేను రోజులు సెలవిచ్చేసే కరుణామయు లేవిటి..."

పకపకా నవ్వాడు "చూశావా? రచనలనగానే నీలో నిద్రాణమై ఉన్న కవిత్వ ధోరణి క్రిష్ణా జలాల్లా వొచ్చేస్తా నంటోంది..."

"ఇదిగో నాయనా... క్రిష్ణా జలాలో గోదావరీ తరంగాలో...."

నామాట కద్దుపద్దాడు.. "ఆ.... అదే..అదే.. గోదా వరి ఒడ్డున కూచుని క్రిష్ణా జలాల్లా పొంగివొచ్చే రచనా

ధార కురిపించు. నీ డిప్రెషన్ గిప్రెషన్ ఎగిరి పోతుంది. మళ్ళీ పావురంలా ఎగిరొచ్చి పని చేయగలుగుతా విక్కడ"

సీరియస్‌గా ఆలోచించి తల ఊపాను సరేనన్నట్టుగా

అంతే... ఇక్కడున్నానీ ఊళ్ళో... హోటల్నించి కాఫీ టిఫినూ భోజనం అన్నీ టైముకి తీసుకొస్తున్నాడు పని కుర్రాడు. రోజూ పొద్దున్నే స్నానం అవగానే కొంచెం సేపు ఇంటికి దగ్గర్లో ఉన్న గుడికి వెళ్ళిరావటం ఆ తర్వాత పెన్నూ కాగితాలు అందుకోడం... సాయంత్రాలు గోదావరొడ్డుకి షికారు. హైదరాబాద్‌లో హైవే మీద ఎపార్టుమెంట్లో ఉండే నాకు ఇక్కడ చాలా హాయిగా ఉంది. ఈ మార్పు నా మనసుకి ఉల్లాసంగా ఉంది. రామ్మూర్తి మంచి సలహానే ఇచ్చాడు.

కానీ ఈ అమ్మాయెవరో తనకి తెలియదు. తన గురించి ఎవరు చెప్పారీమెకి? అడక్కుండానే సమాధానం వొచ్చింది.

"మీరు హైదరాబాద్‌లో ఉన్న మీ స్నేహితుడితో ఫోన్లో మాట్లాడిన దాన్ని బట్టి మీ పని కుర్రాడికి అర్థమైపోయింది. అతనే చెప్పాడు నాతో."

ఆవులిస్తే పేగులెక్కడతాడన్నామాట. ఊరు చిన్నదని ఊళ్ళో మనుషుల్ని చిన్నగా అంచనా వెయ్యకూడదు... ఓ పాఠం నేర్చుకున్నాను.

"నా మీదో కథ రాయండి" మొహం చాలా సీరియస్‌గా పెట్టింది.

"మీ మీదా?"

"నా మీదంటే... నావీపుమీదో పొట్టమీదో కాదు లెండి"

ఛ... ఛ... మరీ అలా మాట్లాడుతుందేమిటి? ఈ అందానికి ఆమాట తీరుబాగులేదు.

"నా గురించి రాయండి"

"మీ గురించి కథ రాసేంత జీవితం మీకింకా లేదు..."

నా మాట పూర్తికానివ్వకుండానే కస్సుమంది. "ఎందుకులేదు? మీకేం తెలుసనీ?" ఔను.. నాకేం తెలుసనీ?

"రాజకీయాలన్నీ తెల్సినదాన్ని..... వాళ్ళ భారతాలన్నీ చెప్పినదాన్ని... వాళ్ళ భాగవతాలన్నీ చూసిన దాన్ని..."

ఆ కళ్ళల్లో నాక్కనిపించిన అష్టపది మెల్లిగా కరిగి పోతున్నట్టుపించింది.

ఆ ముఖంలో అందంగా పారాడిన అన్నమయ్య పదం అలుక్కుపోయినట్టునిపించింది.

"ఈ పిల్లకేవన్నా పిచ్చా అని చూస్తున్నారు కదూ?"

కూచిపూడి భామ కులుకులు కలికానిక్కూడా కనిపించలేదు.

"కాదు. అర్థం చేసుకోడానికి ప్రయత్నిస్తున్నాను" జవాబిచ్చాను.

"అబ్బో! మీ రచయితల భాషే వేరు... అచ్చమైన రచయితల భాషలో జవాబు చెప్పారు.

"మీలాంటి వాళ్ళు కొందరు రాసిచ్చే కదా నాలాంటి వాళ్ళు తయారవుతున్నది..."

ఏవంటోందో దేన్ని గురించి మాట్లాడుతోందో తెలియలేదు.

ఒక్కటి మాత్రం అర్థమైంది.

కోకిల స్వరంతో కసినికక్కుతూ రగిలిపోతున్న ఓ జ్వాల ఈమె అని అర్థమైంది.

"పదండి మీ ఇంటికి... నా కథ వినిపిస్తాను..."

నన్ను రక్షించేవాళ్ళెవరూ లేరు. నన్ను నేనే రక్షించుకోవాలి.

"ఇక్కడే చెప్పండి" వినను అంటే వొదిలేలా లేదు మరి.

"పూర్తిగా వింటారా వెళ్ళిపోకుండా మధ్యలో?"

"వింటాను" ఇబ్బందిగానే ఉంది... ముక్కూ మొహం తెలియని అమ్మాయి.

○ ○ ○

కూతురు పుట్టిన ఏడాదికే భర్త పోవడం రంగమ్మకి పెద్ద దెబ్బే.

ఆ ఇంట్లో ఈ ఇంట్లో పన్లు చేస్తూ కూతుర్ని స్కూల్లో వేసింది. ఆ పిల్లమీద ఆశతోనే బతుకుతోంది. స్కూల్లో వెయ్యకముందునించీ కూడా పిల్ల సిసింద్రీయే.

## వికృతలేఖ

అనుకూలంగా ఉంటే / భాష్యం ప్రతిఫలిస్తుంది
విరుద్ధమైతే చక్కని / ఆలోచన కూడా
వికలమవుతుంది.
దుర్మార్గులు మూర్ఖులు
అయిన కుటుంబ సభ్యుల
మధ్య జీవించడం
మహా నరకం అవుతుంది.

**-జి. శ్రీశైలం**

ఏదైనా సరే.... ఒక్కసారిచెప్తే చాలు... ఇట్టే పట్టేస్తుంది... పద్యం అవ్వనీ... పాట అవనీ... శ్లోకం అవనీ... రెండోసారి నేర్పే అవసరం లేదు... పైగా మాటలో?" ఎంతెంత కష్టమైన మాటలైనా... ఎంతెంత పొడుగు వాక్యాలైనా ఒక్కసారి చెప్తే చాలు...

ఒక తప్పులేకుండా టేపు రికార్డర్లా వినిపించ గలదు. చదువులో ఎప్పుడూ ఫస్టే. మూడో తరగతి లోకి కూతురు నాగమణి రావడం... మందులు వాడ కుండా నిర్లక్ష్యం చేసుకోవడంతో అంతుపట్టని జ్వరంతో రంగమ్మ పోవడం జరిగాయి. పిల్ల బాగా గ్రహణశక్తి గలది కాబట్టి.... దాని మీద ఎక్కడలేని జాలీ ఒలక బోస్తూ తన ఇంటికి తీసుకుపోయాడు మేనమావ శంకరం.

అదివరకెప్పుడూ వాళ్ళ కష్టసుఖాలు పట్టించుకున్న వాడు కాదు.

రాజకీయ పార్టీల వాళ్ళతో గుంపులో గోవిందలా తిరుగుతుంటాడు.

పెద్దప్లానే వేసి పార్టీలో కాస్తంత పలుకుబడున్నా యన దగ్గరికి పిల్లని తీసికెళ్ళాడు.

"ఊ... అయితే పార్టీ ప్రచారానికిదో పెద్ద ఆకర్ష ణంటావ్?" పిల్ల బుగ్గ చిదుముతూ అదోలో చూశాడు.

చాలా మర్యాదగా చేతులు కట్టుకుని తల ఊపాడు శంకరం.

అలా... పార్టీ ప్రచారానికీ... వేరే పార్టీల వాళ్ళని దుమ్మెత్తి పొయ్యడానికీ... పార్టీలో వాళ్ళు చెప్పే పన్లు అదనీ ఇదనీ లేకుండా ఏదైనా చేసి పెట్టడానికి పదును పెట్టారు పసి పిల్లని.

దాని భవిష్యత్తు ఎవడిక్కావాలి?

రాస్తారోకోలు... ధర్నాలు... తగలబెట్టడాలు... హత్యలు... నరకడాలు...

## దిశ

**నా** కనురెప్పలు
దృష్టి దిగ్బంధనం కోసం
వృథా ప్రయత్నాలు!
నా మనసు
దిశా నిర్దేశనం కోసం
సదా ప్రయత్నాలు!

-జి. హెచ్. సంతోషి

ఇవే ఆ పిల్ల చెవిలో మారుమోగుతుంటాయి.

తొడగొట్టి సవాల్ చేస్తాం... ఫలానా పార్టీ అంతు చూస్తా... ఫలానా వాడి పరువు తీస్తాం... అక్కడ వాడిని తుంగలో తొక్కుతాం... ఇక్కడ వీడిని నెత్తిమీద గుద్దేసు కుని పోయేలా చేస్తాం... ఇవే ఆ పిల్ల నోట్లోంచి రాలే దండకాలు... దండిగా శంకరం చేతుల్లో కురిపిస్తు న్నాయి డబ్బులు... మద్యం మత్తులో మునిగి తేలుతూ.. భార్యకానుపు కష్టమై కన్నుమూస్తే... ఇంట్లో పన్లన్నీ కూడా నాగమణికే అప్పచెప్పారు.

పదేళ్ళొచ్చేసరికి పదిహేనేళ్ళ పిల్లలా బాగా ఎత్తరిగా బొద్దుగా తయారయింది పిల్ల. అందరి చూపుల్నీ ఆకట్టుకునే అందం దాని సొత్తయింది.

"నువ్వు పార్టీ మీటింగుల్లో స్పీచ్ చాలా బాగా ఇస్తావు పాపా" అంటూ ప్రతి అడ్డమైన వాడూ మీద చెయ్యి వెయ్యడమే... నచ్చలేదు నాగమణికి... రాను రాను ఆచేతులు తన ఒంటిమీద పాముల్లా పాకు తుంటే...

రాజకీయ ఉపన్యాసంలో తను కసిగా పలికే నరుకుతాం అన్నమాట వాళ్ళ చేతుల మీద ప్రయో గించాలనిపించేది. ఇంత గొంతు చేసుకుని తుంగలోకి తొక్కుతాం అంటూ ప్రతీకార వాంఛతో రగిలి పోతున్న ట్టుగా ఉపన్యాసంలో తానరిచే అరుపుని వాళ్ళ పట్ల చూపించి... వాళ్ళని పడేసి తుంగలో తొక్కాలని పించేది... అన్నీ అనిపించడం వరకే... అనుసరించ డానికి లేదు... కీ ఇచ్చిన బొమ్మల్లే.... బ్యాటరీలేసి పలికించే బొమ్మల్లే... తనని బజార్నపడేశాడు మామయ్య... తన నోటి నుంచి వొచ్చే వ్యర్థప్రేలాపన లకే తప్ప... ఆలోచనారహిత ఆవేశపూరిత తిట్లకే తప్ప... తన మనసుకి విలువలేదు. గుంపులో గోవిం దాలా పార్టీలో తిరుగుతూ రాజకీయాల్లో ముందుకి దూసుకు పోవాలన్నా వాడి కోరికకి తనని బలిపశువుని చేశాడు. వాడు పైకొచ్చింది లేదు... బాగుపడ్డది లేదు. తన బతుకు తనని బతకనిచ్చింది లేదు.

అంతమంది పరిచయస్తుల్లో బాలరాజొక్కడే తన కళ్ళలోకి చూసి తన మనసుని చదివిన వాడు. ఎనిమి దవ తరగతి వరకూ చదువుకున్నాడు. సొంతంగా స్కూటర్లు రిపేర్‌చేసే షాపు పెట్టుకున్నాడు. నీతిగా బత కాలన్న నియమం ఉన్నవాడు. తనంటే మనస్ఫూర్తిగా ఇష్టం నిజమైన జాలీ ఉన్నవాడు. అతని గురించీ తనకి బాగా తెలుసు... అలాంటప్పుడు.. పెళ్ళి చేసుకుని తనకొక మంచి జీవితాన్ని ఇవ్వడానికి మనస్ఫూర్తిగా

అతను ముందుకొస్తే కాదని తనెందుకంటుంది? సంతోషంగా వెళ్ళి మామయ్యతో చెప్తే ఎంత ఎగిరాడు? ప్రేమా... పెళ్ళీఇలాంటి మాటలు నోట్లోంచి రావడానికి వీల్లేదట....

ఇంకోసారి పెళ్ళి అన్నమాట మాటాడితే ప్రాణం తీస్తానన్నాడు.

నువ్వు పెళ్ళి చేసుకుని పోయేందుకా మీ అమ్మ చచ్చిపోతే నిన్నక్కడికి తీసుకొచ్చాను అంటూ కొట్టినంత పని చేశాడు. వారం తిరక్కుండా బాలరాజు శవం గోదావరొడ్డున కనపడింది.

ఎవరు చంపించారో ఆ మాత్రం ఊహించలేదా తను? తన మూలంగానే కదా వాడికాచావు? రాజకీయాల్లో తిరిగే వాళ్ళల్లో మాత్రం మంచివాళ్ళు లేరా? కానీ ఎవరికెళ్ళి మొరపెట్టుకోవాలి తను? వెళ్ళినట్టు తెలిస్తే ఎవరితోనైనా చెప్పుకున్నట్టు తెలిస్తే అసలింక బతకనిస్తాడా? వెంటనే పీకపిసికి చంపెయ్యడూ?

ఓసారి బాలరాజేవని మెచ్చుకున్నాడూ?... గులాబీ పువ్వంత అందమైన దానిని నువ్వు అన్నాడు.

ముల్లు గుచ్చుకోకుండా జాగ్రత్తగా తెంపుకోవచ్చు మొక్కనున్న

గులాబీని... కానీ... ఈ గులాబీ సంగతి వేరు. మామయ్య అనే ముల్లునించి తప్పించి తెంపుకోలేరెవ్వరూ ఈ గులాబీని.

❍ ❍ ❍

"బాగా చీకటి పడిపోయింది.... నేనెళ్తున్నా" చటుక్కున ముగించేసి లేచెళ్ళిపోయింది. ఆమె దూరానికి సాగిపోతున్న అష్టపదిలా.... అన్నమయ్య పదంలా... అలవోకగా కదుల్తున్న కూచిపూడి భామలా.

"ఏవంటుంది సార్ ఆ పిచ్చిది?" మాటతో చిన్న నువ్వు కూడా వినపడితే పక్కకి తిరిగి చూశాను. పని కుర్రాడు రమేష్....

"అదో పిచ్చిపిల్ల సార్... వెర్రి బాగుల్ది"

"అన్నవాళ్ళు పిచ్చివాళ్ళు"

వింతగా చూశాడు నావైపు.

"తన గురించి చెప్పుకుందాసార్?"

"ఔను"

"పాపం! ఎవరితోనూ చెప్పుకోదు... మీరు రచయితని నేనే చెప్పాను. అందుకే మీతో చెప్పుకుని ఉంటుంది".

"కావచ్చు. కానీ చూడు రమేష్... ఎవరిదగ్గిరా ఇంక నేను రచయితనని చెప్పకు.

నేనేం పెద్దపేరున్న రచయితని కాదు"

"సరేసార్... చెప్పను.. కానీ మీరు రాస్తూ ఉండండి సార్. పేరదేవొస్తుంది"

"చిన్నవాడివైనా భలే చెప్పావు" నవ్వుతూ లేచి ఇంటిదారి పట్టాను.

ఎనిమిది గంటలకి భోజనం క్యారియర్ తీసుకొచ్చిన రమేష్ వెంటనే వెళ్ళిపోలేదు. ఏమిటన్నట్టుగా చూశాను. చిన్నగా నసిగాడు. "నాగమణి తన కథ మీకు చెప్పుకుంది కదా! మా ఇద్దరి సంగతీ చెప్పిందో లేదో మరి... మా ఇద్దరికీ ఒకళ్ళంటే ఒకళ్ళకి ఇష్టం... పెళ్ళి చేసుకోవాలని కూడా ఉంది. కానీ బాలరాజుని చంపించినట్టే నన్ను కూడా వాళ్ళ మావయ్య చంపుతాడేమోనన్న ఆలోచనతో భయంతో వెనకాడుతున్నాను..."

"భయపడద్దు రమేష్.. ఎన్నాళ్ళని ఎంతమందినని చంపుతాడు? చెప్పకుండా చేసేసుకోండి పెళ్ళి.... అప్పుడింకేం చేస్తాడు" ధైర్యం చెప్పాను.

❍ ❍ ❍

హఠాత్తుగా మెళ్ళో దండల్తో వొచ్చి జంటగా కాళ్ళకి నమస్కరించారు నాగమణి రమేష్‌లు. "మీరన్న మాటలు సరైనవే అనిపించి మీరిచ్చిన ధైర్యంతో పెళ్ళి చేసుకున్నాను సార్".

జేబులో రెండొందలుంటే తీసిపెళ్ళి బహుమతిగా రమేష్ చేతిలో పెట్టాను. వాళ్ళువెళ్ళాక నా మెదడు నన్ను నిలదీసింది.... "వాడి ప్రాణానికి ముప్పు అయినా కూడా పెళ్ళి చేసుకోమని ధైర్యం చెప్పావు వాడికి. పెళ్ళి నీ ప్రాణానికి ముప్పుకాకపోయినా.. చదువు... డబ్బు.. తిండి... బట్ట .... దేనికి నీకు లోటు లేక పోయినా పెళ్ళి గురించి అంత భయపడతావెందుకు నువ్వు? ఎందుకంత డిప్రెషన్‌కి లోనవుతావు? జీవితమన్నాక సమస్యలుంటాయి. ముళ్ళు గుచ్చుకోకుండా ఒడుపుగా పువ్వుకోసుకున్నట్లే సమస్యల్ని నేర్పుగా పరిష్కరించుకుంటూ వైవాహిక జీవితంలోని అందాన్ని అందుకోడానికి అడుగు వెయ్యి.... అంతేగానీ మరో రకంగా సుఖాలు కొనుక్కుందామని చూసి కోరి కోరి కొత్తకొత్త రోగాలు కొని తెచ్చుకోకు...."

కొత్త ఉత్సాహం పుట్టుకొచ్చింది నాలో గోదావరి తరంగాల్లా..

నిజమే.... గోదావరి నాకు మంచిపాఠం నేర్పింది.

ఇన్నాళ్ళుగా మనసుని కుదిపిన అలల అలజడి ప్రశాంతమై పన్నీటి జల్లు కురిపించింది. ■